సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 4 । జూన్ । 2024



కర్నూలు, అనంత జట్ల విజయం
కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల సీనియర్ క్రికెట్ టోర్నమెంట్‌లో కర్నూలు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. - 8లో



సినీ ఫక్కీలో యువకుడి కిడ్నాప్
మైదుకూరు మండలానికి చెందిన ఓ యువకుడిని కొందరు సినీ ఫక్కీలో కిడ్నాప్ చేయగా ఆ కేసును మైదుకూరు అర్బన్ పోలీసులు రెండు గంటల్లోనే ఛేదించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.400	రూ.500
రెండోరకం	రూ.300	రూ.390



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 623 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	435	520
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 412.280 కిలోలు

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీ 96.21 శాతం

కడప రూరల్ : వైఎస్సార్ జిల్లాలో పింఛన్ల పంపిణీ సోమవారం సాయంత్రం నాటికి 96.21 శాతం నమోదైంది. మొత్తం 2,66,385 పింఛన్లకు రూ 78,75,75,500 అందజేయాలి. అందులో భాగంగా 2,61,611 పింఛన్లకు రూ 77,43,27,000 పంపిణీ చేశారు. మొత్తం 2,66,385 పింఛన్లలో 84 వేల పింఛన్లను అనారోగ్యంతో కదలలేని వారు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే వారి ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. మిగతా వారికి బ్యాంకుల ద్వారా అందజేసేలా చర్యలు చేపట్టారు.

542 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు



మాట్లాడుతున్న కేశవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : దివ్యాంగులను బడి బాట పట్టించే కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమంలో 542 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు సమగ్రశిక్ష జిల్లా కమ్యూనిటి మొబిలైజేషన్ ఆఫీసర్ మిట్టా కేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐఈఆర్పీల ద్వారా ఇప్పటి వరకు పాఠశాలలో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన 18 ఏళ్లలోపు వారి వివరాల కోసం సర్వే జరుగుతోందన్నారు. ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు.సర్వేలో భాగంగా సీకే దిన్నెలో 33 మందిని, మైదుకూరులో 24 , వేములలో 24, బికోడురులో 23, కడపలో 22, ఖాజీపేట, పులివెందుల, వేములలో 21 మందిని, ఎర్రగుంట్లలో 20 మందిని గుర్తించామన్నారు. మిగతా మండలాల్లో కూడా 10 మందికి పైగా గుర్తించామన్నారు.

మద్యం దుకాణాల మూసివేత

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లను మూసివేశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు, బార్లను సీజ్ చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

పెద్దముడియం : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వైఎస్సార్ జిల్లా పెద్దముడియం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డిపై ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సస్పెన్షన్ వేటు వేశారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో గొడవలు జరగకుండా సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి పోలీస్ అధికారులు వారిని హౌస్ అరెస్ట్ చేశారు. మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో వెంకటరామిరెడ్డి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతనికి కాపలాగా హెడ్‌కానిస్టేబుల్ మల్లారెడ్డిని పోలీసులు నియమించారు. అయితే వెంకటరామిరెడ్డి సోమవారం ఉదయం అతని ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. దీంతో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డిని ఎస్పీ సస్పెండ్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్‌లో భాగంగా జమ్మలమడుగు డీఎస్పీకి షోకాజ్ నోటీసు, జమ్మలమడుగు రూరల్ సీఐ,పెద్దముడియం ఎస్ఐకి చార్జిమెమో జారీ చేశారు.

చెక్కభజన కళాకారుడు యల్లయ్య ప్రతిభ



సర్టిఫికెట్ అందుకుంటున్న యల్లయ్య

పోరుమామిళ్ల : వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన చెక్కభజన కళాకారుడు యల్లయ్య తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. ఆదివారం విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవాసంస్థ 'సకల కళ ప్రదర్శన'లు పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. డాక్టర్ మాడుగుల రత్నకుమారి పర్యవేక్షణలో 10 గంటల పాటు నిర్విరామంగా జరిగిన ప్రదర్శనలో 150 మంది కళాకారులు పాల్గొన్నారు. చక్కని ప్రదర్శనలిచ్చిన వారి పేర్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేస్తారు. ఈ ప్రదర్శనలో యల్లయ్య పాల్గొని అందులో స్థానం పొందారు. ఇటీవల యల్లయ్య హైదరాబాదులో సన్మానం పొందిన విషయం తెలిసిందే. సంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షులు రత్నం చేతుల మీదుగా యల్లయ్య సర్టిఫికెట్ అందుకున్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- రాయచోటిలోని సాయి కళాశాలలో నేడే ఓట్ల లెక్కింపు
- రాజంపేట లోక్‌సభతోపాటు ఆరు అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ ప్రక్రియ
- 17 నుంచి 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు నిర్వహణ
- ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లు చొప్పున ఏర్పాటు
- 21 రోజుల ఉత్కంఠకు తెరపడనున్న వైనం



ఓట్ల లెక్కింపు జరిగే సాయి ఇంజనీరింగ్ కళాశాల

సాక్షి రాయచోటి : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు వేళయింది. 20 రోజులకుపైగా నిరీక్షణకు తెరపడనుంది. ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి కౌంటింగ్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకుంటూనే మరోవైపు రౌండ్‌ల వారీగా ఫలితాలు వెల్లడించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలతోపాటు ఒక పార్లమెంటు స్థానానికి మే 13వ తేదీన పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆయా పార్టీల విజయావకాశాలపై ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. మంగళవారం ఉదయం 8.00 గంటల నుంచి ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కానుంది. సాధ్యమైనంత వరకు అన్ని నియోజకవర్గాల ఫలితాలు సాయంత్రం 5.00 గంటల్లోపు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జిల్లాలో భారీగా పోలింగ్ నమోదు

అన్నమయ్య జిల్లాలో పోలింగ్ శాతం కూడా భారీగా నమోదైంది. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు ఒక పార్లమెంటు స్థానానికి సంబంధించి జరిగిన ఎన్నికల్లో ప్రజలు అధిక సంఖ్యలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మే 13న జరిగిన పోలింగ్‌కు సంబంధించి జిల్లాలో 14,26,834 ఓటర్లు ఉండగా, 11,10,831 మంది తమ ఓటుహక్కును వినియోగించారు. దీంతో 77.85 శాతం పోలింగ్ నమోదైంది.

తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

జిల్లాలో జరిగిన ఎన్నికలకు సంబంధించి మంగళవారం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్న నేపథ్యంలో ఈవీఎం యంత్రాల్లో అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమై ఉంది. జిల్లా వ్యాప్తంగా గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. ఈసారి కూడా అదే తరహాలోనే ఫలితాలు ఉంటాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా రాజంపేట, పీలేరులలో గట్టి పోటీ ఉంటుందని భావించినప్పటికీ రాజంపేటలో వైఎస్సార్ సీపీ విజయం నల్లేరు నడకేనని అంచనా వేస్తున్నారు. పీలేరులో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం సాధించే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. మిగతా నాలుగు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం దాదాపు ఖాయమైందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా మంగళవారం సాయంత్రంలోపు అభ్యర్థుల గెలుపోటములు తేలిపోనున్నాయి.

భారీగా కౌంటింగ్ సిబ్బంది

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఆరు నియోజకవర్గాలు, పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి సుమారు 1700-2000 మంది సిబ్బందిని నియమించారు. ఇప్పటికే గుర్తింపు కార్డులను కూడా అందజేశారు. అన్ని విభాగాలకు సంబంధించిన అధికారులతోపాటు ఇతర సిబ్బందిని కౌంటింగ్‌కు వినియోగిస్తున్నారు.

భారీ బందోబస్తు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్‌కు సంబంధించి అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలు చేపట్టారు. కౌంటింగ్ హాలు లోపల సీఐ స్థాయి అధికారులతో పాటు ఇతర కొద్దిమంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. అంతేకాకుండా బయట కూడా భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరింపజేశారు. అలాగే జిల్లాలో 144 సెక్షన్ అమలుతోపాటు పోలీసు పికెట్లను ఏర్పాటు చేసి ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కౌంటింగ్ కేంద్రం పరిసరాలు, రోడ్లను దిగ్బంధనం చేస్తున్నారు.

పోలైన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
రాజంపేట	241200	183442	76.05
రైల్వేకోడూరు	204466	152552	74.61
రాయచోటి	255168	197462	77.39
తంబళ్లపల్లె	224802	186894	83.14
పీలేరు	234608	190234	81.09
మదనపల్లె	266590	200247	75.11
మొత్తం	1426834	1110831	77.85

లోక్‌సభకు సంబంధించి రౌండ్లు, టేబుళ్ల వివరాలు

నియోజకవర్గం	కౌంటింగ్ టేబుళ్లు	లెక్కింపు రౌండ్లు
రాజంపేట	14	21
రైల్వేకోడూరు	14	18
రాయచోటి	14	21
తంబళ్లపల్లె	14	17
పీలేరు	14	20
మదనపల్లె	14	19
పుంగనూరు	14	19

అసెంబ్లీ..కౌంటింగ్ రౌండ్లు, టేబుళ్ల వివరాలు

నియోజకవర్గం	కౌంటింగ్ టేబుళ్లు	లెక్కింపు రౌండ్లు	పోస్టల్ బ్యాలెట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాజంపేట	14	21	3035	03	02
రైల్వేకోడూరు	14	18	1784	02	02
రాయచోటి	14	21	3534	04	02
తంబళ్లపల్లె	14	17	2109	02	02
పీలేరు	14	20	4118	04	02
మదనపల్లె	14	19	3587	03	03

కౌంటింగ్ కేంద్రాలు ఎక్కడంటే....



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. అన్నమయ్య జిల్లా, రాయచోటి కేంద్రంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ ప్రత్యేక దృష్టి సారించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఇలా.....
రాయచోటి పట్టణం, మాసాపేట పరిధిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

గ్రౌండ్ ఫ్లోర్....
24-రాజంపేట పార్లమెంట్ సెంటర్,
128-రాయచోటి సెగ్మెంట్.
రాజంపేట పార్లమెంట్ సెగ్మెంట్
(పోస్టల్ బ్యాలెట్).....
128-రాయచోటి అసెంబ్లీ సెగ్మెంట్.

ఫస్ట్ ఫ్లోర్....
24-రాజంపేట పీసీ, 125-రాజంపేట సెగ్మెంట్, 162-తంబళ్లపల్లి సెగ్మెంట్, 163-పీలేరు సెగ్మెంట్,164- మదనపల్లి సెగ్మెంట్.

అసెంబ్లీ నియోజకవర్గాలకు....
125-రాజంపేట అసెంబ్లీ సెగ్మెంట్, 162-తంబళ్లపల్లి అసెంబ్లీ సెగ్మెంట్, 163-పీలేరు అసెంబ్లీ సెగ్మెంట్, 164-మదనపల్లి అసెంబ్లీ సెగ్మెంట్.

సెకండ్ ఫ్లోర్.....
24-రాజంపేట పీసీ, 127-రైల్వేకోడూరు (ఎస్సీ) సెగ్మెంట్, 127-రైల్వేకోడూరు (ఎస్సీ) అసెంబ్లీ సెగ్మెంట్.

ఓట్ల లెక్కింపు సజావుగా సాగేలా చూడాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించిన స్ఫూర్తితో కౌంటింగ్ ప్రక్రియను కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని వైఎస్సార్ జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు సూక్ష్మ పరిశీలకుల(మైక్రో అబ్జర్వర్ల)కు సూచించారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రంలో విధులకు హాజరయ్యే సూక్ష్మ పరిశీలకుల(మైక్రో అబ్జర్వర్ల)కు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల పరిశీలకులు కునాల్ సిల్కు, భాను దాస్ పాలవె లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు ముఖ్య అతిథిగా హాజరై కౌంటింగ్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, నింపవలసిన ఫార్మెట్ల గురించి అవగాహన కల్పించారు. ట్రైనర్లు పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మే 13 న నిర్వహించిన పోలింగ్ ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎలా ప్రశాంతంగా నిర్వహించారో.. అదే స్ఫూర్తితో ఓట్లు లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ కు విధులు కేటాయించిన సిబ్బంది అందరూ ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, అప్పుడు మీకు టేబుల్ ను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు ఐ.జె. విజయ్ కుమార్, సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి
కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న (మంగళవారం) జరుగనున్న నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులకు స్థానిక మోంట్‌ఫోర్ట్ స్కూల్‌లో వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ దిశానిర్దేశం చేశారు.

పల్లకిలో ఊరేగిన శ్రీ భద్రకాళీ సమేతుడు



పల్లకిలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకిలో ఊరేగారు. సోమవారం రాత్రి మూల విరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, రంగు రంగుల పూలతో అలంకరించి భక్తుల దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆపై వివిధ రకాల పూలతో, పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి ఆలయ మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పూజలు నిర్వహించారు.

విత్తనకాయల పంపిణీ పరిశీలన



రైతులకు వేరుశనగ విత్తనకాయల ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న చంద్రానాయక్

చిన్నమండెం : మండల కేంద్రంలోని చిన్నమండెం -1 రైతు భరోసా కేంద్రంలో రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనకాయల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులు స్థానిక ఆర్బీకేలో పేరు నమోదు చేసుకొని రాయితీ విత్తన కాయల ప్యాకెట్‌ను తీసుకోవచ్చన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఏఓలు గీత, రమేష్‌రాజు, ఏఈఓ బ్లెస్సీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ఉపకారం

- విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్‌షిప్
- జూన్ 7 వరకు దరఖాస్తుకు గడువు

మదనపల్లె సిటీ : చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజినీ దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ కింద ఉపకార వేతనం అందిస్తోంది. 2016లో ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థి ప్రతిభ ఆధారంగా నచ్చిన కోర్సులో ఇంటర్మీడియట్ చదవడానికి స్కాలర్‌షిప్ లభిస్తుంది. విద్యార్థి చదువుతున్న కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు ఉపకార వేతనం అందుతుంది. ఎంపికైన విద్యార్థులకు ఈ ప్రోగ్రాం ద్వారా భవిష్యత్తుకు అవసరమైన దిశానిర్దేశం చేస్తారు.

పథకం పొందేందుకు అర్హతలు ఇవే..
సరోజిని దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం పొందాలంటే విద్యార్థి కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.2 లక్షలలోపు ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి. ఇంటర్మీడియట్ చదువుతున్న వారై ఉండాలి. పదిలో కనీసం 90 శాతం మార్కులు సాధించి ఉండాలి. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక విధానం..
చదువులో చూపిన ప్రతిభ, ధ్రువపత్రంలో తెలిపిన సమాచారం ఆధారంగా ఎంపిక చేస్తారు. జూన్ 23న దరఖాస్తులకు ఆన్‌లైన్ పరీక్ష/ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 20 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

7వ తేదీ వరకు గడువు
విద్యాదాన్ ఉపకార వేతనం కోసం జూన్ 7లోగా దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతి మార్కులు జాబితా, పాస్‌ఫొటో, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధ్రువీకరణపత్రం, చదువుతున్న కాలేజీ వివరాలు పొందుపరచాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారు వ్యక్తిగతంగా ఈ మెయిల్ ఐడీని పొందుపరచాలి. ఇతరుల ఈమెయిల్ ఐడీలను అనుమతించరు. భవిష్యత్తులో ఎస్‌డీఎఫ్ నుంచి ఎటువంటి సమాచారమైనా ఈమెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. అందుకే సొంత ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకుని దాని పాస్‌వర్డ్ గుర్తుంచుకోవాలి.

కొత్త బంగారు లోకం!

'స్కూల్ లైఫ్ నుంచి.. లైఫ్ స్కూలులోకి నడిపేదె సోదరా ఇంటర్' అన్నాడో సినీ కవి. హైస్కూల్ విద్య పూర్తి చేసుకొని ఇంటర్‌లో చేరే విద్యార్థులకు కాలేజీ లైఫ్ 'కొత్తబంగారు లోకం'లాగానే ఉంటుంది. ఇంటర్‌లో పడే అడుగులే జీవితాన్ని మార్చి వేస్తాయి. జీవితంలో బాగుపడాలన్నా.. బాధపడాలన్నా ఇదే కీలక సమయం. ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులు
- ఉత్సాహంగా కళాశాలలోకి విద్యార్థుల తొలి అడుగులు



కళాశాలలోకి విద్యార్థుల తొలి అడుగులు

రాజంపేట టౌన్ : కాలేజీ లైఫ్‌లో అడుగు పడింది. విద్యార్థులంతా ఉత్సాహంగా కళాశాలలకు వస్తున్నారు. తల్లిదండ్రుల ఆంక్షలు సడలిపోయాయి..... విద్యార్థుల్లో కొత్త కొత్త ఆలోచనలు.... టీనేజీ కావడంతో వారిలో నూతనోత్సాహం ఉరకలేస్తుంది. ఈ ఉత్సాహం శృతిమించకుంటే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు పడినట్లేనని విద్యావంతులు, మేధావులు చెబుతున్నారు. టీనేజీలో కోరికలను, ఆలోచనలు అదుపులో పెట్టుకొని చదువుపై దృష్టిసారిస్తేనే విద్యార్థి జీవితం విజయతీరానికి చేరుతుందని వారు అంటున్నారు.

తల్లిదండ్రుల సూచనలు, సలహాలను విధిగా పాటిస్తూ టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇప్పుడు ఇంటర్ ప్రథమ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. టెన్త్ వరకు విద్యార్థుల జీవితం ఒక ఎత్తయితే ఆ తరువాత సాగే జీవితం మరో ఎత్తులాంటిదనే చెప్పాలి. టెన్త్ వరకు చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏమాత్రం సేచ్ఛనివ్వకుండా కట్టుదిట్టమైన ఆంక్షల మధ్య పెంచుతారు. తమ పిల్లలు టెన్త్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్న ఆశవల్లే తల్లిదండ్రులు పిల్లల పెంపకం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబరుస్తారు. ఆ సమయంలో తల్లిదండ్రులు ప్రతి చిన్నవిషయాన్ని భూతద్దంలో చూస్తారు. టెన్త్ తరువాత ఇంటర్మీడియట్‌లో చేరాక తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు కాస్త స్వేచ్ఛనిస్తారు. తల్లిదండ్రులు సేచ్ఛ, విద్యార్థుల్లో కాలేజీ స్థాయికి వచ్చామన్న ఫీలింగ్, కొత్త స్నేహాలు వీటన్నింటికి తోడు టీనేజీలో వచ్చే ఆలోచనలు చాలా మంది విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. టీనేజీ వయస్సులో విద్యార్థులు ఎక్కువగా ఆకర్షణలకు లోనవుతుంటారు. అలాంటి ఆలోచనలు పక్కన పెట్టి చదువుపై శ్రద్ధ పెడితే ప్రతి విద్యార్థి భవిష్యత్తు ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు పడతాయి.

స్నేహితుల ఎంపిక కీలకం
కాలేజీ లైఫ్‌లో స్నేహితులను ఎంపిక చేసుకోవడం చాలా కీలకమైనది. ముఖ్యంగా ఇంటర్మీడియట్‌లో ఏర్పడే పరిచయాలు, స్నేహాలు విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయి. ఇంకా చెప్పాలంటే భవిష్యత్తును కూడా నిర్దేశిస్తాయి. టెన్త్ వరకు తల్లిదండ్రుల పెంపకం వల్ల దాదాపు విద్యార్థులంతా సరైన మార్గంలో పయనిస్తారు. ఇంటర్‌లో ప్రవేశించాక సరైన వారితో స్నేహాలు ఏర్పడక అనేక మంది విద్యార్థులు తప్పుదారి పడుతుంటారు. అందువల్ల స్నేహితులను ఎంపిక చేసుకోవడంలో ఆచితూచి అడుగులు వేయాలి. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు స్నేహాల గురించి తెలుసుకోవాలి. తమ పిల్లలకు కళాశాలలో ఏర్పడిన స్నేహాలు మంచివి కావని తెలిస్తే అలాంటి స్నేహాలకు దూరంగా ఉండాలని సుతిమెత్తగా చెప్పాల్సిన అవసరం ఏంతైనా ఉందని విద్యావేత్తలు అంటున్నారు. మంచివారితో స్నేహం మంచి భవిష్యత్తుకు బాటలు వేస్తాయని వారు అంటున్నారు.

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలి



టీనేజీలోని కాలేజీ విద్యార్థుల ఆలోచనలు చాలా వేగంగా ఉంటాయి. చాలా మంది కాలేజీ లైఫ్‌ను ఎంజాయ్ చేద్దామన్న ఆలోచనలు ఉంటాయి. అలాంటి ఆలోచనలు విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేస్తాయి. అందువల్ల విద్యార్థులు ఇంటర్మీడియట్ రెండేళ్లు కూడా మరే వ్యాపకం లేకుండా చదువుమీదే దృష్టి సారిస్తే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోగలరు. విద్యార్థులు మంచి మార్గంవైపు అడుగులు వేసేలా మా వంతు ఖచ్చితంగా కృషి చేస్తాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు టీనేజీ వయస్సు దాటుకునేవరకు వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

– ఎస్వీ.రమణరాజు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజంపేట

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


సుదర్శన్ బాబు (ఫైల్)

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పాలెం బుర్జు పల్లెకు చెందిన సుదర్శన్ బాబు (38) అనే వ్యక్తి గత వారం రోజులుగా కనిపించ లేదని బాధితుని తండ్రి కొండయ్య, తమ్ముడు నారాయణలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విష్ణువర్దన్ రెడ్డి తెలిపారు. వివరాల మేరకు సుదర్శన్ బాబు గతనెల 28వ తేదీ మంగళ వారం సాయంత్రం స్నేహితులతో కలిసి శేషాచలం అడవిలోకి వెళ్లాడని తెలిపారు. సుదర్శన్ బాబుతో వెళ్లిన స్నేహితులు తిరిగి ఇంటికి వచ్చారని, కానీ సుదర్శన్ బాబు ఇంటికి రాక పోవడంతో మరుసటిరోజు అడవిలో వెతికినా ఫలితం లేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాటి చెట్టుపై పిడుగు


పిడుగు పడడంతో తాటిచెట్టు నుంచి వస్తున్న మంటలు

తొండూరు : తొండూరు మండల పరిధిలోని అగడూరు గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడింది. అయితే ఈ పిడుగు పంట పొలంలో తాటిచెట్టుపై పడడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. పిడుగు ఎక్కడ పడిందోనని గ్రామస్తులు భయాందోళన చెందారు. ఉదయం పంటపొలంలో తాటి చెట్టుపై పిడుగు పడిందని సమాచారం తెలియడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఉరుములు, మెరుపులతో అక్కడక్కడా పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీదే అధికారం

ఖాజీపేట : వైఎస్సార్‌సీపీనే మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధీమావ్యక్తం చేశారు. దుంపలగట్టులో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి లేకుండా ప్రజారంజక పాలన అందించారని కొనియాడారు.

కర్నూలు, అనంత జట్ల విజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల సీనియర్ క్రికెట్ టోర్నమెంట్‌లో కర్నూలు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. సోమవారం వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 43.3 ఓవర్లలో 136 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని టి.వంశీకృష్ణ 36 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ కమ్రుద్దీన్ 3 వికెట్లు, ఇస్మాయిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 27.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. జట్టులోని సాయి సూర్యతేజ 56 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్ 72 పరుగులతో రాణించాడు. దీంతో కర్నూలు జట్టు 7 వికెట్ల ఆధిక్యంతో విజయం సాధించింది.

అనంత జట్టు విజయకేతనం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలో 195 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని మాధవ్ 70 పరుగులు చేశాడు. అనంత బౌలర్ కమిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 33.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. జట్టులోని గిరినాథ్‌రెడ్డి 77 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్సర్‌లతో 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో అనంతపురం జట్టు 1 వికెట్ తేడాతో విజయం సాధించింది.


వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో తలపడుతున్న కడప, కర్నూలు జట్లు


100 పరుగులు చేసిన అనంత బ్యాట్స్‌మన్ గిరినాథరెడ్డి


72 పరుగులు చేసిన కర్నూలు బ్యాట్స్‌మన్ సాయి సూర్యతేజ

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


కిందకు వాలిన తీగలకు తగిలి మృతి చెందిన జయరాం

బి.కొత్తకోట : విద్యుత్‌తీగలు కిందకు వాలిపోవడంతో విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన ఘటన జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు. బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ కొత్త పల్లెకు చెందిన కత్తి జయరాం (55) వ్యవసాయం, పాడిపై ఆధారపడి జీవిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం జయరాం ఆవులు తోలుకుని వెళ్తుండగా పొలం పైనుంచి వెళ్తున్న విద్యుత్ సరఫరా తీగలు కిందకు వాలిపోవడంతో విద్యుత్‌తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై డిస్కం ఏఈ గిరిబాబు మాట్లాడుతూ విద్యుత్ స్తంభం స్టే వైరు తెగిపోయిన కారణంగా సరఫరా తీగలు కిందకు వాలిపోవడంతో ప్రమాదం జరిగినట్టు గుర్తించామని తెలిపారు.


గాయపడిన శివశంకర్

యువకునికి తీవ్ర గాయాలు

బి.కొత్తకోట : విద్యుత్ షాక్‌కు గురైన యువకునికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బడికాయలపల్లె గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు..బుర్రాలగడ్డకు చెందిన ఓ ఇంటికి విద్యుత్ సరఫరా సమస్య తలెత్తడంతో శివశంకర్ అనే యువకుడు లోపం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుండగా షాక్‌కు గురయ్యాడు. వైద్య చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ ఘటనపై డిస్కం ఏఈ గిరిబాబు మాట్లాడుతూ ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం పీటీఎం మండలంలో జరిగింది. కురవ్రాండ్లపల్లికి చెందిన ఆదిమూర్తి కుమారుడు రవి కుమార్ (32), కుటుంబ సమస్యలతో ఇంటి వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనం ద్వారా మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ఐసీయూ విభాగంలో చికిత్స అందించడంతో కోలుకుంటున్నాడు.

రేపు శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, సాయంత్రం 6 గంటలకు గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం ఉంటుందని వివరించారు.

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జూటూరు మధుసూదన్‌రావు దంపతులు అన్నదానం చేశారని సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

బడిఈడు పిల్లలను కార్మికులుగా మార్చవద్దు

కడప ఎడ్యుకేషన్ : బడి ఈడు పిల్లలను షాపుల్లో, కర్మాగారాల్లో కూలీలుగా, కార్మికులుగా పనిలో పెట్టుకోవద్దని లేబర్ ఆఫీసర్ పాల్ జాన్సన్ మునిస్వామి, లీగల్ ప్రొబిషన్ ఆఫీసర్ సునీత పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలి పరిసర వీధుల్లో, షాపులను, మెకానిక్ షెడ్లను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని షాపు యజమానులకు సూచించారు. బడిలో ఉండాల్సిన పిల్లలు పనిలో ఉండటం నేరమని చెప్పారు.

జిల్లా క్రికెట్ జట్టుకు నందలూరు క్రీడాకారులు

నందలూరు : కడప జిల్లా బాలికల అండర్-15 క్రికెట్ జట్టుకు నందలూరు సబ్ సెంటర్ నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎ.అనిల, పూర్విజా (మీడియం ఫాస్ట్ బౌలింగ్)కు ఎంపికైనట్లు హెడ్ కోచ్ గయాజ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నెల్లూరులో జరిగే అండర్-15 మ్యాచ్‌కు వీరు ఎంపికయ్యారన్నారు. గతంలో ఇదే నందలూరు సబ్ సెంటర్ నుంచి అండర్-15, అండర్-19, సీనియర్స్ విభాగాలలో హరిప్రియ, దివ్య శ్రీలు జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడాకారులుగా ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది కూడా నందలూరు సబ్ సెంటర్ నుంచి ఇద్దరు క్రీడాకారులు అండర్-15 జట్టుకు ఎంపిక కావడం పట్ల హెడ్‌కోచ్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడి, ట్రైనర్ శివకోటి, క్యురేటర్ హరికృష్ణ, స్థానిక సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.


అండర్-15 క్రికెట్ జట్టుకు ఎంపికైన ఎ.అనిల, పూర్విజా

23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్టు
- రెండు కార్లు స్వాధీనం

వాల్మీకిపురం : అక్రమంగా తరలిస్తున్న 23 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పులిశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ మండలంలోని చింతపర్తి - నిమ్మనపల్లి రోడ్డులోని రైల్వేగేటు సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా రెండు కార్లు అతివేగంగా వచ్చాయన్నారు. పోలీసులను చూసి కారులోని వ్యక్తులు పారిపోతుండగా.. సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి, ముగ్గురు వ్యక్తులను పట్టుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. కారులో రూ.28,02,000 విలువ చేసే 700 కిలోల 23 ఎర్ర చందనం దుంగలు ఉన్నాయన్నారు. అలాగే ఏపీ05బిహెచ్2727 నంబరు గల ఇన్నోవా వాహనం రూ.2లక్షలు, కేఏ03ఎంహెచ్1769 మహీంద్రా లోగాన్ రూ.లక్ష విలువ చేస్తాయన్నారు. దీంతో నిందితులు వాల్మీకిపురం మండలం కూరపర్తికి చెందిన పట్నం లక్ష్మణాచారి (35), పట్నం శ్రీరాములు ఆచారి (30), తిరుపతి రూరల్ ముత్యాలరెడ్డిపల్లికి చెందిన పూడి పవన్ కుమార్ (34)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ పులిశేఖర్ తెలిపారు. సుండుపల్లి దగ్గరలోని సానిపాయి అడవుల్లో అక్రమంగా ప్రవేశించి ఎర్ర చందనం చెట్లను నరికి బెంగళూరుకు తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిలో ఇద్దరు నిందితులపై గతంలో కూడా ఎర్ర చందనం కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ నాగేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎర్రచందనం, కార్లు, నిందితులను చూపుతున్న పోలీసులు

శ్లాబ్ మట్టిరాళ్లు తలపై పడి మహిళ మృతి

రాయచోటి టౌన్ : మూడంతస్తుల మిద్దెపై నుంచి శ్లాబ్ మట్టి రాళ్లు పడటంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన రాయచోటి పట్టణంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని మాసాపేట 1వ వార్డులో చిన్న రెడ్డెయ్య, లక్ష్మీప్రసన్న (38) దంపతులు నివాసముంటున్నారు. ఈమె వలంటీర్‌గా పని చేస్తున్నారు. వీరికి బీటెక్ చదువుతున్న అఖిల్ అనే కుమారుడు ఉన్నాడు. సోమవారం ఉదయం ఇంటిలో ఉన్న సమయంలో సమీప బంధువు ఒకరు దశదిన కార్యక్రమం సమాచారం చెప్పేందుకు వచ్చారు. దీంతో ఆమె ఇంటిలో నుంచి బయటికి వచ్చింది. తిరిగి లోపలికి వెళ్లే సమయంలో వీరి ఇంటికి ఆనుకొని ఉన్న స్థలంలో నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనానికి సంబంధించిన శ్లాబ్ కొయ్యలు, మట్టి పెళ్లలు ఆమె తలపై పడ్డాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. ఇంటి యజమాని శ్రీనివాసులు మూడవ అంతస్తుకు శ్లాబ్ వేసి కొయ్యలు అలాగే వదిలేశాడు. అది ప్రమాదంగా ఉందని తెలియచేసినా పట్టించుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


తలపై శ్లాబ్ మట్టి పెళ్లలు పడి మృతి చెందిన లక్ష్మీప్రసన్న

కౌంటింగ్ రోజు పటిష్ట బందోబస్తు

- అల్లర్లు చేస్తే కఠిన చర్యలు
- ప్రొద్దుటూరులో విస్తృతంగా పర్యటించిన జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్

ప్రొద్దుటూరు క్రైం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. ఎస్పీ సోమవారం ప్రొద్దుటూరులో విస్తృతంగా పర్యటించారు. కొత్తపల్లె జంక్షన్, శివాలయం సెంటర్, రాజీవ్‌సర్కిల్ తదితర ముఖ్య కూడళ్లలో నిర్వహిస్తున్న పోలీసు బందోబస్తును పరిశీలించారు. అక్కడి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్‌తో పాటు ఇతర నిషేధాజ్ఞలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మురళీధర్, సీఐలు శ్రీకాంత్, అబ్దుల్ కరీం, వెంకటరమణ, రమణారెడ్డిలు, సీఐలు ఉన్నారు.


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్

నిరంతరం అప్రమత్తంగా ఉండండి

మైదుకూరు : మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో నిరంతరం అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. సోమవారం ఆయన మైదుకూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాయలంలో బందోబస్తు నిర్వహణపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. సమస్యలు సృష్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. బందోబస్తు నిర్వహణపై పలు సూచనలు చేశారు. సమావేశంలో మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు, అర్బన్, రూరల్ సీఐలు ఏపీ మస్తాన్, శ్రీనాథరెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన రవివర్మ

పుల్లంపేట : ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పుత్తనవారి పల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. అనంతరాజుపేట గ్రామానికి చెందిన రవివర్మ (32), పరశురాం అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నారు. మండల పరిధిలోని పుత్తనవారి పల్లి మలుపు వద్దకు రాగానే వారి వాహనం అదుపు తప్పి మోరీని ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న రవివర్మ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం నుంచి బయటపడేవాడని పోలీసులు, స్థానికులు పేర్కొంటున్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనం అదుపు తప్పిన సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లి మండలంలో జరిగింది. కర్ణాటక రాష్ట్రం బైరకూరు మండలం హెబ్బిణి పంచాయతీ సున్నపుకుంటకు చెందిన ప్రైవేటు ఉద్యోగి టి.గంగరాజు (25), ఎలక్ట్రీషియన్ ఎస్.దామోదర్ (22) ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనులపై మదనపల్లికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని 150వ మైలు వద్ద జ్యూస్ ఫ్యాక్టరీ సమీపంలో, రామసముద్రం మండలం పెద్ద కురవపల్లె పంచాయతీ ఓబిలి నాయనపల్లెకు చెందిన రెడ్డప్ప కుమార్తె రోషిత (11) బంధువులతో కలసి బస్టాప్‌లో దిగి బొగ్గిటివారిపల్లెకు నడిచి వెళుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో విద్యార్థిని రోషిత తీవ్రంగా గాయపడింది. ద్విచక్ర వాహనంలోని టి.గంగరాజు, తీవ్రంగా గాయపడగా దామోదర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను వెంటనే మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం రోషితను మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా గంగరాజును తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.


గాయపడిన విద్యార్థిని రోషిత, గంగరాజు

సినీ ఫక్కీలో యువకుడి కిడ్నాప్

రెండు గంటల్లోనే ఛేదించిన మైదుకూరు పోలీసులు

మైదుకూరు : మైదుకూరు మండలానికి చెందిన ఓ యువకుడిని కొందరు సినీ ఫక్కీలో కిడ్నాప్ చేయగా ఆ కేసును మైదుకూరు అర్బన్ పోలీసులు రెండు గంటల్లోనే ఛేదించారు. అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు కొందరు మైదుకూరు మండలం జీవీ సత్రం గ్రామానికి చెందిన అవిరేని సంతోష్ అనే యువకుడిని కిడ్నాప్ చేశారు. ఆ విషయాన్ని సంతోష్ సోదరుడు శివకు ఫోన్ చేసి చెప్పారు. వీసా ఇప్పిస్తామని నమ్మబలికి సంతోష్ తమ వద్ద నుంచి సుమారు రూ.3లక్షలు తీసుకున్నాడు. తమ డబ్బులు తిరిగి ఇస్తేనే అతన్ని విడిచిపెడతామని బెదిరించారు.. ఈ విషయంపై సంతోష్ తండ్రి శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు ఆదేశాలతో అర్బన్ సీఐ మస్తాన్, ఎస్‌ఐ రాజరాజేశ్వర్ రెడ్డి, దువ్వూరు ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. రెండు గంటల్లోనే కిడ్నాప్‌కు పాల్పడిన 10 మంది నిందితులను జాతీయ రహదారి బైపాస్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అరెస్టు చేశారు. వారి చెర నుంచి సంతోష్‌ను క్షేమంగా అతని తండ్రికి అప్పగించారు. నిందితులు కిడ్నాప్ కోసం ఉపయోగించిన బొలెరో వాహనాన్ని, 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సంతోష్‌ను కిడ్నాప్ చేసింది ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన దుర్గారెడ్డి, వెంకటేశ్వర్లు మరో 8 మందిగా గుర్తించినట్లు సోమవారం అర్బన్ సీఐ మస్తాన్ తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేవలం రెండు గంటల్లోనే కేసును ఛేదించి, కిడ్నాపర్ల బారి నుంచి బాధితుడిని కాపాడి, నిందితులను అరెస్టు చేసినందుకు జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు, అర్బన్ సీఐ మస్తాన్, ఎస్‌ఐ రాజరాజేశ్వర్ రెడ్డి, దువ్వూరు ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బందిని అభినందించారు.


కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు చూపుతున్న అర్బన్ సీఐ మస్తాన్

'హందో.. హమారే బారా' సినిమాను నిషేధించాలి


డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పవిత్ర ఖురాన్‌కు వ్యతిరేకంగా నిర్మించిన 'హందో - హమారే బారా' అనే హిందీ సినిమాను వెంటనే నిషేధించాలని వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు మహమ్మద్ అలీఖాన్, బాబు భాయ్, డాక్టర్ నాజిముద్దీన్‌లు కోరారు. సోమవారం ఈ మేరకు వారు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లాం సంప్రదాయం, సంస్కృతి, ముస్లింలు, ముస్లిం మహిళల నిబద్ధత, వారి వ్యక్తిగత జీవితాలను వక్రీకరిస్తూ అన్ను కపూర్ అనే దర్శక నిర్మాత ఈ సినిమాను నిర్మించి ముస్లింల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారన్నారు. అంతేకాకుండా దైవ గ్రంథమైన పవిత్ర ఖురాన్ లోని సూరా బకరాను వక్రీకరిస్తూ ట్రైలర్ విడుదల చేశారన్నారు. ముస్లిం మహిళలను కించపరుస్తూ ఇస్లాం సంప్రదాయాన్ని అవహేళన చేస్తూ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో ఈ చిత్రాన్ని నిర్మించారని ఆరోపించారు. భారతీయ సినిమాటోగ్రఫీ చట్టం కింద ఈ సినిమాను నిషేధించాలని డిమాండ్ చేశారు. అలాగే చిత్ర నిర్మాత, దర్శకుడు అను కపూర్‌తో పాటు, ఈ సినిమాలో నటించిన నటీనటులపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో సినిమాను నిషేధించే వరకు ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నజీర్ అహ్మద్, సంఘ సేవకుడు సలావుద్దీన్, మత గురువులు జాకీర్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, మిల్లి కౌన్సిల్ ప్రతినిధి నయీమ్, తాహిర్, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

ప్రొద్దుటూరు : అవినీతికి పాల్పడిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాజంపేటలో ఎండోమెంట్‌కు సంబంధించిన రెండు ఎకరాలను ఆయన అమ్మినప్పుడు దేవదాయశాఖ అధికారులు చార్జ్‌మెమో జారీ చేశారన్నారు. ప్రొద్దుటూరులో ఆవులు లేకున్నా, షెడ్ లేకున్నా పశుగ్రాసం కోసం రూ.లక్ష డ్రా చేసి అవినీతికి పాల్పడ్డారన్నారు. నామా ఎరుకలయ్య ఆశ్రమంలో 10 బాత్రూంలను రూ.18,50,000లతో నిర్మించగా ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరాయన్నారు. బాత్రూంలు రిపేరుకు అని రూ.లక్ష డ్రా చేశారన్నారు. సిమెంటు రోడ్డుకు రూ.25లక్షలు ఖర్చు చేశారని లెక్కలు చూపారని, వాస్తవానికి ఆ సిమెంటు రోడ్డు రూ.5లక్షలు విలువ కూడా చేయదన్నారు. ఇంకా ఇలాంటి పలు అవినీతి చర్యలకు ఆయన పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వం విచారణ జరిపి శంకర్ బాలాజీని సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

కడప కల్చరల్ : రోడ్డు ప్రమాదాలను నివారించే బాధ్యత పౌరులందరిపైన ఉందని సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులురెడ్డి అన్నారు. జిల్లాలో వేసవి సెలవులను పురస్కరించుకుని విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాలలో భాగంగా సోమవారం కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు నియమాలు, రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల గురించి ఆయన రూపొందించిన ఛాయాచిత్ర పోస్టర్లు విద్యార్థులకు ప్రదర్శించారు. విద్యార్థులు రోడ్డు నియమాలను తెలుసుకొని భద్రతా నియమాలు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత అందరి బాధ్యతని, అందరూ రోడ్డు నియమాలు తెలుసుకొని పాటించినపుడే ప్రయాణాలు సౌకర్యవంతంగా, క్షేమదాయకంగా సాగుతాయన్నారు. పరిమితవేగంతో వెళ్లాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత విషయాలన్నీ ప్రతి ఒక్కరూ తెలుసుకుని జీవితంలో అనుసరించాలని, రోడ్డు భద్రత పాటించాలని తెలిపారు. లైబ్రేరియన్ బాబ్జీ, సురేష్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడి మృతి


చెరువులో పడి మృతిచెందిన బీమా

బద్వేలు అర్బన్ : ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతిచెందిన ఘటన సోమవారం బద్వేలు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని సాయినగర్‌కు చెందిన శ్రీనివాసులు, రామలక్షుమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చివరివాడైన ముండ్లపాటి బీమా (10) పట్టణంలోని భావనారాయణనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో కాలనీకి సమీపంలోని భాకరాపేట చెరువులో సరదాగా చేపలు పట్టేందుకు అన్న శేషాద్రి, మరికొందరితో కలిసి చెరువు వద్దకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు కాలుజారి బీమా చెరువులో పడిపోవడంతో అన్న శేషాద్రి, మిగిలిన వారు హుటాహుటిన కాలనీకి వచ్చి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు చుట్టుపక్కల వారితో కలిసి చెరువు వద్దకు వెళ్లేరికి బీమా నీటిలో మునిగిపోయాడు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులకు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న వారు చెరువులో గాలించి బాలుడిని వెలికితీశారు. అయితే అప్పటికే బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో సాయినగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలుడి తండ్రి కూలి పనుల నిమిత్తం తెలంగాణ రాష్ట్రానికి వెళ్లినట్లు తెలిసింది. ఘటనపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

చాపాడు : గ్రామీణ ప్రాంతాలలో సైతం ప్రభుత్వం నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. మందుల వినియోగంపై 104 సిబ్బందిని ఆరా తీశారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులను అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, పీహెచ్ఎన్ సుకన్య, ఎంఎల్‌హెచ్‌పీ శృతి, ఏఎన్ఎం మెరీనా, 104 సిబ్బంది సిద్దయ్య, మల్లికార్జున, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అన్నవరంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ